క్లుప్తంగా

గో సేవలో తరించండి

ప్రొద్దుటూరు రూరల్ : అన్ని పూజలలో గో పూజ పుణ్యకార్యమని, గో సేవలో ప్రజలు తరలించాలని హైదరాబాద్ శ్రీసద్గురు సమర్థనారాయణ ఆశ్రమం పీఠాధిపతి, శ్రీసద్గురు సమర్థనారాయణ మహరాజుల మనువడు ప్రభుదత్త మహరాజు పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలోని శ్రీసద్గురు సమర్థ నారాయణ స్వామి ఆశ్రమంలో జరుగుతున్న స్వామివారి 35వ ఆరాధన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆశ్రమంలో దేవతా మూర్తులకు అభిషేకాలు, అర్చనలు ఆయన నిర్వహించారు. హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమాధిపతి గోపాల స్వామి, నిర్వాహకులు నాగేంద్ర, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వరదకు బైపాస్ సర్జరీ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు గుండెకు స్టంట్ వేయడానికి ఆరోగ్యం సహకరించకపోవడంతో బుధవారం బైపాస్ సర్జరీ చేశారు. ఆపరేషన్ అనంతరం ఆయన ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఈ పరిస్థితుల కారణంగా కొద్ది రోజుల వరకు ఎవరు ఆయనను చూడడానికి రావద్దని, జనం వచ్చి కలవడం వల్ల ఇన్‌ఫెక్షన్ అయ్యే అవకాశం ఉందని ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డి తెలిపారు. ఆయన ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను తాను తెలియజేస్తానన్నారు.

రాయలసీమ బిషప్‌గా డాక్టర్ బాలయ్య పీటర్

ప్రొద్దుటూరు : పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన మన్నా చర్చి రెవరెండ్ డాక్టర్ ఎస్.బాలయ్య పీటర్‌ను రాయలసీమ బిషప్‌గా ఎన్నుకున్నారు. మంగళవారం రాత్రి గుంటూరు కార్యాలయానికి సంబంధించిన ప్రతినిధులు శోభన్‌బాబు, స్టాన్లీ బాబు, లాజర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పాస్టర్ రాజ్‌కుమార్, బాలుతోపాటు సంఘ పెద్దలు నూతనంగా ఎన్నికైన బిషప్ దంపతులను ఘనంగా సన్మానించారు.

నిధుల దుర్వినియోగంపై గ్రామ సభ

కాశినాయన : మండలంలోని కత్తెరగండ్ల గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామ పంచాయతీ ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గత నాలుగేళ్లుగా పంచాయతీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని వారు తెలిపారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీఓ ముజఫర్ రహీం సమాధానం ఇస్తూ పంచాయతీ నిధులు దుర్వినియోగం కాలేదని, దుర్వినియోగం అయ్యేందుకు ఆస్కారమే లేదని తెలిపారు. పనులు చేసిన వాటికి ఇంజనీరింగ్ అధికారులు చేసిన ఎం బుక్ ప్రకారమే నిధులు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

పాఠశాల తనిఖీ


బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని వరుణ్ హైస్కూల్ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారన్న ఫిర్యాదులు అందడంతో బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వరుణ్ పాఠశాలలోని తరగతులను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడాన్ని ఆయన గుర్తించినట్లు తెలిసింది. పాఠశాల యాజమాన్యం నిబంధనలను పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆయన సూచించారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు


గాంధీ బొమ్మ సర్కిల్‌లో నిలిచిన వర్షం నీరు

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ప్రధాన రహదారి బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి చెరువును తలపిస్తోంది. ప్రధాన రహదారి డివైడర్ పనులు ఆగిపోయాయి. దీంతో కురిసిన కొద్దిపాటి వర్షానికి సైడ్ కాలవలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుమీద నిలబడుతుంది. రోడ్డులో నీరు నిలబడి వాహనదారులు ప్రజలు దారిలో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డులో వర్షపు నీరు ఉండడంతో నడవడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ప్రయాణించాలంటే భయాందోళనగా ఉందని అంటున్నారు.

నివాళి


రామిరెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండలంలోని చిన్నగురువళూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కోడూరు రామిరెడ్డి (56) బుధవారం ఉదయం గుండె పోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చిన్నగురువళూరుకు వెళ్లి రామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, నారాయణరెడ్డి, గాంధీనగరం శివారెడ్డి, జయసుబ్బారెడ్డి, పైలట్ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మధ్యతరగతి.. అధోగతి

- కూటమి పాలనలో అమలు కాని పథకాలు
- నియోజకవర్గంలో 1.70 లక్షల మందిపై ప్రభావం
- ఆందోళనలో మధ్యతరగతి కుటుంబాలు



కాశినాయన : గత ఏడాది క్రితం వరకు ఎంతో దర్జాగా జీవించిన మధ్యతరగతి ప్రజలు ప్రస్తుతం జీవన ప్రమాణాలు సన్నగిల్లి ఆదాయం పడిపోయి దుర్భరంగా మారాయి. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేసి మధ్య తరగతి ప్రజలకు వర్తింపజేసి అండగా నిలిచారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్ పథకాలంటూ ఆర్భాటంగా ప్రకటించి వాటిలో ఉచిత గ్యాస్, తల్లికి వందనం తప్ప ఏ పథకాన్ని అమలు చేయలేదు.

పథకాలు అమలు కాక కుదేలు

గత ఏడాది క్రితం వరకు ఆసరా, చేయూత, కాపు నేస్తం, బీసీ నేస్తం, నేతన్న నేస్తం వంటి పథకాలతో పాటు సమయానికి డ్వాక్రా మహిళా సంఘాలకు అందిజేసి మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు చేపట్టారు. 2019-24 వరకు ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం చేసినట్టుగానే మధ్య తరగతి ప్రజలకు జగన్ ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకుంది. జగన్ ఇచ్చిన హామీల్లో దాదాపు అన్ని నెరవేర్చడంతో ఆయా పథకాల లబ్ధితో మధ్యతరగతి ప్రజలు సంతోషంగా జీవించారు. ఆయా పథకాల ద్వారా నగదు తమ ఖాతాల్లో నేరుగా జమ అయ్యేది. 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చుకుంటూ మధ్యతరగతి వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా అందించింది.

నిలువునా మోసం

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను, ప్రకటించిన పథకాలను అమలు చేయకపోవడంతో బద్వేలు నియోజకవర్గంలో దాదాపు 1.70లక్షల మంది ప్రజలపై ప్రభావం పడింది. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని, 18 ఏళ్లు నిండి ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 ఇస్తామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని, రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని, వలంటీర్లకు నెలకు రూ.10వేలు ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చింది. అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింది. దీంతో మధ్యతరగతి ప్రజలు తాము నిలువునా మోసపోయామని గ్రహించారు. వారితో పాటు చిరు ఉద్యోగులు, చిన్న చిన్న వ్యాపారులు చేసుకునేవారు, ఉపాధి పనులు చేసుకునేవారు నియోజకవర్గంలో అధిక శాతం ఉన్నారు. ప్రభుత్వం చేసిన మోసాలతో వారంతా ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు.

హామీలను నెరవేర్చాలి

గత ప్రభుత్వం ఏడాదికి మా కుటుంబానికి ఏడాదికి కనీసం నాలుగు పథకాలకు సంబంధించిన నగదు బ్యాంక్‌లో జమ అయ్యేది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క పథకాన్ని కూడా సరిగా అమలు చేయలేదు. ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం కోల్పోకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

– దస్తగిరమ్మ, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

మహిళలను మోసం చేశారు

గత ప్రభుత్వం పేదలకు ఆసరాగా నిలిచి పథకాల ద్వారా నగదు బ్యాంక్ ఖాతాలకు జమ చేసింది. ఉచిత బస్సు అని చెప్పి మహిళలను మోసం చేశారు. అలాగే 18 ఏళ్లు నిండిన ఆడ బిడ్డకు నెలకు రూ.1,500 ఇస్తామన్న హామీని నెరవేర్చలేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

– గుర్రమ్మ, నాయునిపల్లె, కాశినాయన మండలం

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు సంగటి చంద్రశేఖర్, చంద్రమోహన్‌రాజు విమర్శించారు. బుధవారం స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఒక్క పెన్షన్ పెంపు తప్పా.. ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, రైతుభరోసా, నిరుద్యోగ భృతి వంటి హామీల ఊసేలేదని ఎద్దేవాచేశారు. అలాగే కడప వేదికగా జరిగిన మహానాడు కార్యక్రమంలో వారం రోజుల్లోనే కడప ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభమవుతాయని చెప్పినప్పటికీ నేటికీ ఆ హామీ నెరవేరలేదని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసిన తర్వాతనే ప్రజల్లోకి రావాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు జకరయ్య, నియోజకవర్గ నాయకులు రామరాజు, బాబు, విజయరావు, జయరామరాజు, విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ అనిల్, పట్టణ నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం

పోరుమామిళ్ల : ఏడాది కూటమి పాలనలో అభివృద్ధి శూన్యమని పీసీసీ సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అన్వర్ విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా రెండు మూడు హామీలు నెరవేర్చి సామాజిక పెన్షన్ మాత్రమే ప్రచారం చేసుకుంటున్నారని తప్పుబట్టారు. యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500, బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్, ఉచిత బస్సు పథకాన్ని విస్మరించారని పేర్కొన్నారు. ఎన్నకల ప్రచారం ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కాశినాయన : రైతులు వ్యవసాయ అధికారుల సూచించిన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏఈఓ రవి తెలిపారు. బుధవారం మండలంలోని వరికుంట్ల, నాయునిపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరటి పంటను పరిశీలించారు. అరటి పంటలో సిగటోగ ఆకు మచ్చ తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, మందులు పిచికారి చేసే విధానాన్ని రైతులకు తెలిపారు. మొక్క జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీ విద్యార్థికి ప్రథమ ర్యాంక్

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్) కాలేజీ విద్యార్థికి యోగివేమన యూనివర్సిటీ ప్రథమ ర్యాంక్ వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో బీఎస్సీ హానర్స్ (ఫిజిక్స్) రెండో సంవత్సరం చదువుతున్న షేక్ అఫ్జన్‌కు 10/10 జీపీఏ సాధించి యూనివర్సిటీ ప్రథమం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

బీవీ పట్టాభిరామ్ సేవలు మరువలేం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంద్రజాలకుడు, రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బీవీ పట్టాభిరామ్ సేవలు మరువలేమని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన తన పుస్తకం 'జాగ్రత్తండోయ్ జాగ్రత్త'కు ముందుమాట రాశారని గుర్తు చేసుకున్నారు. మానసిక కౌన్సెలింగ్ ద్వారా ఎందరో జీవితాలలో వెలుగులు నింపారని కొనియాడారు.

పచ్చిరొట్ట విత్తనాలకు నిరీక్షణ

గోపవరం : భూసారాన్ని పెంచేందుకు ఖరీఫ్ పంటల సాగుకి ముందు పొలాల్లో విత్తుకునేందుకు పచ్చిరొట్ట ఎరువు విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్‌లో వివిధ పంటలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రైతులకు మొండిచేయి చూపించింది. మండల వ్యాప్తంగా వర్షాధారంపైనే రైతులు ఆధారపడి పంటలు సాగు చేస్తారు. సకాలంలో వర్షాలు పడితే ఆయా చెరువుల కింద వరిపంట వేసేందుకు అవకాశం ఉంది. దీంతో భూసారవంతం కోసం ముందుగా రైతులు జీలగలు, జనుములు సాగు చేసుకుంటారు. గత ప్రభుత్వం వరుసగా ఐదేళ్ళ పాటు సబ్సిడీ ద్వారా సకాలంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు (జీలగలు, జనుములు) పంపిణీ చేయడం జరిగింది. ఏటా మాదిరే ప్రభుత్వం సబ్సిడీ ద్వారా జీలగలు, జనుములు పంపిణీ చేస్తుందని రైతులు ఆయా రైతుసేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు ఏం చెప్పాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. అయితే ఈ ఏడాది జీలగలు, జనుములు పంపిణీ ఉండదని సిబ్బంది చెప్పడంతో రైతులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు బయట మార్కెట్‌కు వెళ్లి కేజీ రూ.130 నుండి రూ.150లకు జీలగలు, జనుములు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది.

మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి


ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డితో బద్వేలు మైనార్టీ నేతలు

బద్వేలు అర్బన్/పోరుమామిళ్ల: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పలువురు మైనార్టీ నాయకులు పోరుమామిళ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ బద్వేలు పట్టణంతో పాటు నియోజకవ ర్గ వ్యాప్తంగా తొలి నుంచి అధిక శాతం మైనార్టీలంతా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వెన్నంటే నడుస్తున్నారని, వా రి సమస్యలను జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తామని తెలిపారు. మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఉమర్, 13వ వార్డు కౌన్సిలర్ హసన్, ఆయా వార్డుల ఇన్‌చార్జి లు షంషీర్, నూరుల్లా, రెహమాన్, జమాల్‌వల్లి, పి.కరీముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు పుత్తాశ్రీరాములు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలింత మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : విధుల్లో నిర్లక్ష్యం వహించి బాలింత మృతికి కారకులైన తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బండిజకరయ్య కోరారు. బుధవారం గుండంరాజుపల్లె గ్రామంలో మృతురాలి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్ద కాన్పు అయిన పెంచలమ్మ తీవ్ర రక్తస్రావం అవుతుండటంతో ఆమె కుటుంబ సభ్యులు తొట్టిగారిపల్లె పీహెచ్‌సీకి తీసుకెళితే సకాలంలో పూర్తి స్థాయి వైద్యం అందక పెంచలమ్మ మృతి చెందిందన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పూర్తిస్థాయిలో విచారించి బాలింత మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దోమల నివారణతోనే మలేరియాకు అడ్డుకట్ట

బద్వేలు : దోమల వ్యాప్తిని అరికట్టడంతో మలేరియా వ్యాధి నివారణకు అడ్డుకట్ట వేయవచ్చని బద్వేలు వైద్యశాఖ సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు. బుదవారం కాశినాయన మండలం నరసాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డెంగీ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ ప్రతీ ఏడాది మలేరియా మహమ్మారి కారణంగా మరణాలు సంభవిస్తూనే ఉన్నాయని అన్నారు. మలేరియా వ్యాధి సోకడానికి ముఖ్యంగా ఆడ అన్నాఫిలెస్ అనే దోమ కుట్టడంతో వస్తుందన్నా రు. మలేరియా వ్యాధికి ముందస్తు రాడికల్ చికిత్స ద్వారా మరణాలను తగ్గించవచ్చన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడేను పాటించాలని సూచించారు.అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి కుమారి పుష్ప, సీహెచ్‌ఓ నిర్మల, పీహెచ్‌ఎన్. శారద, హెల్త్ సూపర్‌వైజర్ డి.బాలయ్య, హుసేనమ్మ, చంద్రశేఖర్‌స్వామి, సత్యనారాయణ ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన చేయించుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ దేవి పద్మలత

చాపాడు : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకునే రైతులు తప్పనిసరిగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనా పథకం నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత పేర్కొన్నారు. మండలంలోని పెద్దగురువళూరు, చిన్నగురువళూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలన్నారు. బీమా వివరాల కోసం తమ గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. గ్రామాలలో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు పాల్గొని వ్యవసాయ పంటల సాగుపై మెళకువలు తీసుకోవాలని సూచించారు. పంటల బీమా చేయించుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల వలన పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లినా ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేష్‌రెడ్డి, వీహెచ్‌ఏ మాధవీలత, ఏపీసీఎన్‌ఎఫ్ బీఎంటీ కృష్ణారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించకండి

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు జిల్లా కలెక్టర్ ఆదేశం


గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలతో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

మైదుకూరు : గురుకుల పాఠశాలలో విద్యార్థులైనా, సిబ్బందైనా క్రమశిక్షణతో మెలగాల్సిందే.. క్రమశిక్షణ తప్పితే ఎవరినీ ఉపేక్షించకండి, డిస్మిస్ చేయండి అంటూ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మైదుకూరు మండలం వనిపెంటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.నిర్మలను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థినులకు ప్రిన్సిపాల్ టీసీలు ఇవ్వడం వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో కలెక్టర్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలో కొద్ది రోజులుగా జరిగిన విషయాలను ప్రిన్సిపాల్ కలెక్టర్ శ్రీధర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో వ్యక్తిగత స్పర్ధలు, సమస్యలు ఉండకూడదన్నారు. దేశంలో ఉద్యోగులు లేక ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారని, వచ్చిన ఉద్యోగాన్ని చేసుకోకపోతే అలాంటి వారు పాఠశాలకు అవసరం లేదని పేర్కొన్నారు. రాజకీయాలు పట్టించుకోవద్దని సూచించారు. క్రమశిక్షణ తప్పిన వారి కోసం ఎమ్మెల్యే సిఫారసు చేసినా పట్టించుకోవద్దని అన్నారు.

ఖాళీ సీట్లను భర్తీ చేయండి

పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలను ఆదేశించారు. పాఠశాల ప్రారంభమై 20 రోజులైనా పిల్లలు చేరలేదంటే వారు వేరే స్కూల్‌లో నైనా చేరి ఉండాలి.. లేదంటే ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండాలని పేర్కొన్నారు. సీటు పొందినా చేరని వారికి సోమవారం లోపు చేరాల్సిందిగా సమాచారం ఇవ్వాలని సూచించారు. సోమవారం నాటికి కూడా వారు చేరకపోతే మంగళవారం ఖాళీలను ప్రకటించి రాత పరీక్ష ఆధారంగా మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయాలని ఆదేశించారు.

రాజకీయాలను పట్టించుకోవద్దు

పాఠశాల విషయంలో స్థానిక రాజకీయాలను, గ్రామ స్థాయి నాయకుల బెదిరింపులను పట్టించుకోవద్దని కలెక్టర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఎవరైనా పాఠశాల విషయంలో జోక్యం చేసుకుని సమస్యలు సృష్టించాలని చూస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. క్రమశిక్షణతో సమయపాలన పాటించాలని పాఠశాల ఉపాధ్యాయ బృందానికి కలెక్టర్ సూచించారు. మంచి వాతావరణం సౌకర్యాలు ఉన్న వనిపెంట గురుకుల పాఠశాల ఏడాదికల్లా జిల్లాలోనే బెస్ట్ పాఠశాలగా మారాలని అన్నారు. కలెక్టర్ వెంట బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర ఉన్నారు.

విజయనగరంలో తాగునీటి అవస్థలు


బైక్‌పై తాగునీరు తెచ్చుకుంటున్న వ్యక్తి

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె పంచాయతీ విజయనగరం గ్రామంలో నాలుగు రోజులుగా మంచినీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో కుళాయిలకు నీటిని అందించే బోరు మోటారు చెడిపోవడంతో తాగునీటి కోసం గ్రామ ప్రజలు సమీపం పొలాల్లోని బోర్ల వద్ద కెళ్లి ఆటోలు, బైక్‌లు, సైకిళ్లలో తెచ్చుకుంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన బోరు మోటార్ చెడిపోయింది. మంచినీటి సమస్య, మోటారు రిపేర్‌పై పంచాయతీ, ట్రాన్స్ కో అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోలేదని దీంతో మంచినీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. మంచినీటి సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకురాగా ట్రాన్స్ కో ఏడీ ఫోను చేసి మరమ్మతులు చేస్తామని చెప్పినప్పటికీ చెడిపోయిన మోటార్ మరమ్మతులకు నోచుకోలేదని స్థానిక నివాసి జెర్మియా తెలిపాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించిన తమ గ్రామంలో మోటార్‌కు మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికలు కోరుతున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాషా

ప్రొద్దుటూరు క్రైం : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి పాటు పడాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాషా తెలిపారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని దీప్తి జూనియర్ కాలేజీలో బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చేలా కృషి చేయాలని సూచించారు. దేశ భ విష్యత్తు విద్యార్థులు, యువతపై ఆధారపడి ఉందనే విషయాన్ని గుర్తించుకొని నడుచుకోవాలని సీఐ అన్నారు. పోక్సో యాక్ట్, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ 112, రహదారి భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ ఎస్ఐ పి. హనుమంతు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత పథకాలపై అవగాహన


లక్ష్మీనరసమ్మకు చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

అట్లూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అట్లూరులో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సామాజిక భద్రత పథకాలైన పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై, పీఎంజేబీవై, ఈ-కేవైసీ, డిజిటల్ ఫ్రాడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లీడ్ జిల్లా మేనేజర్ జనార్దన్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిఒక్కరూ ఇన్స్యూ కలిగి ఉండాలన్నారు. ఇన్స్యూ ఉపయోగాలు, పెన్షన్, ఆన్‌లైన్ మోసాలు గురించి తెలియజేశారు. ఇన్స్యూ లేనివారు బ్యాంకులో గాని ఆర్థిక అక్షరాస్యత కేంద్రంలో గాని ఇన్స్యూ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఇన్స్యూ పథకంలో ఇదివరకే చేరిన ఎ.మహేశ్వరరెడ్డి గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన భార్య లక్ష్మీనరసమ్మకు రూ.2 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ దుశ్యంత్, ఫీల్డ్ ఆఫీసర్లు రాయుడు, సంతోష్, సర్పంచ్ యల్లమ్మ, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు సిద్దారెడ్డి, నాగలక్ష్మి, వీఓఏ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'జింకా'కు మొల్ల సాహితీ సేవా పురస్కారం


జింకా సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న హనుమంతరావు

గోపవరం : వివిధ రంగాల్లో అర్ధ శతాబ్దానికి పైగా సేవ చేసిన జింకా సుబ్రహ్మణ్యంకు మొల్ల సాహితీ సేవా పురస్కారాన్ని అందజేశారు. బుధవారం మండలంలోని మొల్ల విగ్రహ సన్నిధిలో ప్రొద్దుటూరుకు చెందిన సుబ్రహ్మణ్యంను మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరస్వతిపుత్ర పుట్టపర్తి నారాయణచార్యులు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, తెలుగుతల్లి విగ్రహాల ఏర్పాటు జింకా ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీ పీఠం సభ్యులు పాల్గొన్నారు.